క్లుప్తంగా

ఎమ్మెల్సీ సాబ్జీ కార్యాలయంలో వేడుకలు



ఎమ్మెల్సీ సాబ్జీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఉపాధ్యాయులకు బాసటగా నిలవాలి



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్: నాడు-నేడు పథకం ద్వారా కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ఉపాధ్యాయులు బాసటగా నిలవాలని ఎంపీడీఓ బి.ప్రణవి కోరారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీడీఓ ప్రణవి, యూటీఎఫ్ నాయకులు నంబూరి రాంబాబు, జీవీ సూరప రాజు, పి.శ్రీనివాస్‌కుమార్, పీవీ సుబ్బారావు, కోటేశ్వరావు, పి.సత్యనారాయణ, బాషా, కె.దేవీ ప్రసాద్, బి.శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కార్యాలయం బోర్డులో మండలం పేరు సవరణ

దెందులూరు: ఎట్టకేలకు పశుసంవర్ధకశాఖాధికారులు గోపన్నపాలెంలోని అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన కార్యాలయం బోర్డులో తప్పుగా రాసిన మండలం పేరును మార్చారు. గోపన్నపాలెంలో సీమపందుల పెంపకం కేంద్రం, అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం సూచించే బోర్డులో గోపన్నపాలెం పెదవేగి మండలం అని రాశారు. 'సాక్షిలో' ఈ అంశంపై ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు పెదవేగి స్థానంలో దెందులూరు అని మార్పు చేశారు.

పేదల కళ్లలో వెల్లివిరిసిన ఆనందం

ఏలూరు మండలంలో 499 కొత్త పింఛన్ల పంపిణీ



వెంకటాపురంలో వృద్ధురాలికి పింఛను సొమ్ము అందిస్తున్న కార్పొరేటర్ తంగెళ్ల రాము

ఏలూరు రూరల్: కొత్త సంవత్సరం తొలిరోజు పేదల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. ఏలూరు మండలంలోని గ్రామాలతో పాటు కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో అర్హత కల్గిన 499 మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేసింది. ఆదివారం గ్రామ వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పింఛన్ల పంపిణీని ఉత్సాహంగా చేపట్టారు. స్థానిక వెంకటాపురంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ తంగెళ్ల రాము లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇచ్చిన హామీ నెరవేర్చుతున్నారని కొనియాడారు. ఒకపక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మరోపక్క అర్హత కల్గిన పేదలందరికీ పింఛన్లు అందించడం ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా నెలనెలా ఇంటికి పంపిస్తున్న పింఛను డబ్బులు పేదల జీవితాలకు ఆధారంగా మారాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

నేడు ముక్కోటి ఏకాదశి పూజలు

నగరంలోని పలు వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు పూర్తి



జనార్దనస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేసిన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైకుంఠ ఏకాదశి సందర్భంగా నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పూజలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం చేసుకునే విధంగా భక్తులకు ప్రత్యేక సౌకర్యం ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచి స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం భక్తులకు అందుబాటులో ఉంటుంది. ఈ సందర్భంగా ఆలయంలో అలంకార అధ్యయనోత్సవాలను (రాపత్తు ఉత్సవాలు) ఉదయం 6.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి మత్స్యావతార అలంకరణ చేయనున్నారు. స్థానిక పవర్‌పేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవాసుదేవస్వామి ఆలయంలో స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం ఉదయం 5.30 గంటల నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీజగన్మోహిని అలంకరణ చేయనున్నారు. రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 5 గంటల నుంచి స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కోవిడ్ కొత్త వేరియంట్ బీఎఫ్ 7 వ్యాప్తి చెందుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భక్తులంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామివార్ల దర్శనం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటించాలని సంబంధిత అధికారులు సూచించారు.

బధిర విద్యార్థుల నడుమ వేడుకలు



బధిర విద్యార్థికి కేక్‌ను తినిపిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఆపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): దొండపాడులోని పరివర్తన బధిరుల పాఠశాల విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం బధిర విద్యార్థులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉత్సాహంగా కేక్ కట్ చేసి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో పిల్లలందరూ చక్కగా చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పిల్లలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయ సంఘాలు జాతీయ నాయకుల చిత్రపటాలను తమ క్యాలెండర్లపై ముద్రించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ వే.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి క్రొవ్విడి రాజకుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల గణపతి, రుద్రపాక శ్యామ్‌సుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్ధా రాంబాబు, ఊడా మహేష్, బీఎస్ఎన్‌కే కల్యాణి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్‌లను జిల్లా కలెక్టర్ వే.ప్రసన్న వెంకటేష్ ఆదివారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులకు శుభాకాంక్షలు తెలిపి, విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు, ఎం.రాధ, సీ గోపి పుల్లారావు, డీఎస్ ప్రసాద్, ఐ.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు సహకరించండి



విద్యుత్ ఓసీ ఉద్యోగుల క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈ సాల్మన్ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడానికి విద్యుత్ ఉద్యోగులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ పి.సాల్మన్ రాజు కోరారు. ఓసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీలను ఎస్‌ఈ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న విద్యుత్ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడంలో ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. రైతులకు వ్యవసాయం కోసం 9 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ అందించడానికి శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు తురగా రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఎస్‌ఈకి కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.నిరంజన్, సీహెచ్‌పీ శ్రీనివాస్, కే గోపాలకృష్ణ, జీసీవీ రామయ్య, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని జేసీకి వినతి



జేసీ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న నడపన దాన భాస్కరరావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని పలు చోట్ల నీటి సరఫరా నిలిచిపోయిందని, తక్షణం సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పశ్చిమ మండల అధ్యక్షులు నడపన దాన భాస్కర్ ఆదివారం జేసీ పి.అరుణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ శాంతినగర్, ఫిరంగుల దిబ్బ, విద్యానగర్, ఆదర్శ్ నగర్, ఏటిగట్టు, పోస్టల్ కాలనీ తదితర ప్రాంతాల్లో గత మూడురోజులుగా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని, దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి సంబంధించి స్థానిక 23వ డివిజన్ కార్పొరేటర్ కల్వకొలను సాంబ, 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతి, ఏలూరు కార్పొరేషన్ సెక్రెటరీని కలిసి వినతి పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజును కలిసిన కొల్లేరు పెద్దలు

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం ఏలూరు మండలం కొల్లేరు గ్రామాల పెద్దలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు, గుడివాకలంక ఉపసర్పంచ్ ఘంటసాల రుక్మనంద మహరాజ్ తదితరులు కొల్లేరు గ్రామాలకు ప్రభుత్వ కళాశాల మంజూరు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ప్రతిరోజూ కొల్లేరు గ్రామాల నుంచి విద్యార్థులు సుమారు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఏలూరులో కళాశాలకు వెళ్లి వస్తూ అవస్థలు పడుతున్నారని వివరించారు. దీనిపై ఎంపీపీ స్పందించి మాట్లాడుతూ మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే గుడివాకలంక జెడ్పీ పాఠశాల అదనపు తరగతి గదుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1.95 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేస్తే కళాశాల మంజూరుకు మార్గం సుగమం అవుతుందన్నారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణాలు సైతం వేగంగా పూర్తి చేసేందుకు సహకరించాలని ఎంపీపీ పెద్దలను కోరారు.

అభివృద్ధే ధ్యేయంగా కృషి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరితో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేయిస్తున్న దెందులూరు మండల నాయకులు

పెదవేగి : నూతన సంవత్సరంలో అభివృద్ధే ధ్యేయంగా సంకల్పసిద్ధితో కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, అబ్బయ్యచౌదరిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా రాట్నాలకుంటలో రాట్నాలమ్మతల్లి దేవస్థానంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కొఠారు రామచంద్రరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వారు పుస్తకాలు, పెన్నులు, పండ్లు అందించి, స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	54	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	10-12
బెండకాయలు	40	కంద	30
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	38
కాకర కాయలు	24-34	కీరా దోస	56
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	50	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30	పాలకూర	08
దొండకాయలు	40	చుక్కకూర	08
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణి	68
ఆనబకాయ (1)	25	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	08
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33

దెందులూరులో నగర సంకీర్తన

దెందులూరు: దెందులూరులో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం దశమి తెల్లవారుజామున భూ, నీళా సమేత చెన్నకేశవరస్వామి (విష్ణు ఆలయం) ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటలకు నగర సంకీర్తన నిర్వహించారు. మహిళలు, పురుషులు సంప్రదాయ దుస్తులు ధరించి విష్ణు ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి రథంతో పాటు గ్రామంలోని పురవీధుల్లో నగర సంకీర్తన చేశారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో అన్నసమారాధన

పెదవేగి : నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం భక్తాంజనేయునికి భక్తులు అఖండ దీపారాధనతో పాటు విశేష పూజలు చేసారు. మండలంలోని వేగివాడలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జనవరి 1నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాలను కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

చర్చి నిర్మాణానికి రూ.30 వేల వితరణ

పెదవేగి : దేవుని ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని వంగూరు ఫాదర్ చిన్ను అన్నారు. పెదవేగి మండలం వంగూరు పంచాయతీ గొగినేపల్లిలోని నూతనంగా నిర్మిస్తున్న క్రైస్తవ దేవాలయానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలతో మండల నాయకులు కేశన సతీష్ రూ.30 వేలు విరాళం చెక్కును అందించారు. చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందించిన సతీష్‌ను ఫాదర్ అభినందించి, సత్కరించారు.

భోగాపురంలో పేకాట స్థావరంపై దాడి

భీమడోలు: గుండుగొలను పంచాయతీ శివారు భోగాపురంలో పేకాట స్థావరంపై ఆదివారం భీమడోలు పోలీసులు ఆకస్మిక దాడి చేసారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ నేతృత్వంలో పోలీసుల బృందం దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,200 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి తాటాకిల్లు దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి ఆదివారం తెల్లవారుజామున ఒక తాటాకిల్లు దగ్ధమైంది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోడ బాలరాజు కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఇంటికి నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాదాన్ని గుర్తించిన బాలరాజు, కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి, ప్రాణాలను దక్కించుకున్నారు. సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని సామాగ్రితో పాటు పొలం దస్తావేజులు, 3 కాసుల బంగారం, రూ.3 లక్షల నగదు కాలిబూడిదైనట్టు బాధితుడు బాలరాజు తెలిపాడు.

ఆంజనేయస్వామికి లక్ష చామంతి పూజ

ఉంగుటూరు: గోపినాథపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం లక్ష గులాబి, లక్ష చామంతి, లక్ష తులసీ దళాలతో పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొని సతీసమేతంగా పూజలు నిర్వహించారు. కొట్టు సత్యనారాయణ కుటుంబానికి ఆరాధ్యదేవుడైన ఆంజనేయ స్వామి ఆలయానికి ఆయ నే చైర్మన్. కోడిగూడెం భక్త సమాజం సభ్యులు హనుమాన్‌ఛాలీసా పారాయణం చేశారు. వైభవంగా నిర్వహిస్తున్న పూజల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొంటున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,09,000 ను విరాళంగా అందజేశారు. పినకడిమికి చెందిన సీహెచ్ శ్రీనివాస్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

గోవింద స్వాముల ఇరుముడిధారణ

ద్వారకాతిరుమల : మండలంలోని తిరుమలంపాలెంలో గోవింద స్వాములు ఆదివారం ఇరుముడిధారణ చేశారు. గురుమాత గుంపుల నాగలక్ష్మి ఆధ్వర్యంలో, అరిగిల శ్రీరామ చంద్రుడు, పురోహితులు శనగవరపు నాగేశ్వరరావుల సమక్షంలో దీక్షాదారులు ఇరుముడులను ధరించారు. అనంతరం శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుకలో పాల్గొన్నారు.

అలరించిన నృత్యోత్సవం



నాట్య ప్రదర్శన

ద్వారకాతిరుమల : శ్రీవారి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన నృత్యోత్సవం చూపరులను అలరించింది. దేవదాయ శాఖ - ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ నృత్యోత్సవాన్ని ముందుగా ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్య కారిణులు భరతనాట్య ప్రదర్శనలు చేశారు.